నియోజకవర్గంలో 5వేల ఎకరాలు భూ పంపిణీ చేసాం...

సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ

విశాలాంధ్ర-రామభద్రపురం : బొబ్బిలి నియోజకవర్గం లో భూమిలేని నిరుపేదలకు సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో 5000 ఎకరాలు భూ పంపిణీ చేయడం జరిగిందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ అన్నారు. సోమవారం జాతీయ రహదారి పక్కన జన్ని వలస జంక్షన్ ఎదురుగా సిపిఐ 99 పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా సీనియర్ న్యాయవాది కామ్రేడ్ ఖండాపు ప్రసాదరావు చేతులమీదుగా సిపిఐ జెండాను ఆవిష్క రించారు. ఈ సందర్భంగా రమణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల దళిత గిరిజనుల అభ్యున్నతకే సిపిఐ పార్టీ ఎల్లవేళలు పోరాటం చేస్తుం దని అన్నారు. 1925 డిసెంబర్ 25న ఉత్తరప్రదేశ్ లక్నోలోని కాన్పూర్లో పార్టీ పుట్టిందని అన్నారు. అప్పటినుంచి ఇప్పటివరకు దేశం కొరకు అనేకమంది కమ్యూ నిస్టులు అసువులు బాసారని అన్నారు. దేశంలో పుట్ట గొడుగుల్లా అనేక పార్టీలు పుట్టుకొస్తున్నప్పటికీ సిపిఐ పార్టీకి రోజురోజుకీ ఆదరణ పెరుగుతుందని అన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి ఆనందరావు మాట్లాడుతూ మండల పరిధిలోని నిరుపేదలకు 265 ఎకరాలు భూమిలేని వారికి పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. 40 సంవత్సరాలుగా పార్టీకి సేవలు చేయడం చాలా సంతృప్తిగా ఉందని తెలిపారు.

ఊపిరి ఉన్నంతవరకు సీపీఐలోనే ఉంటానని అన్నారు. సీనియర్ న్యాయవాది కామ్రేడు ఖండాపు ప్రసాద్ రావు మాట్లాడుతూ కమ్యూనిస్టులు అందరూ ఐక్యంగా ఉండి పోరాటంచేస్తే దేనినైనా సాధించవచ్చని అన్నారు. పోరాటంలో భాగంగా కమ్యూ నిస్టులపై ఎన్ని కేసులు పెట్టినా ఎవరు భయపడరని అన్నారు. అనంతరం ప్రజానాట్యమండలి కార్యదర్శి కాల కృష్ణ కు ఘనంగా సన్మానం చేశారు. అనంతరం పేదలకు బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మన్యం జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి జీవ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య , విజయనగరం జిల్లా, వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శిరావు, రామభద్రపురం, మండల పార్టీ నాయకులు సామిరెడ్డి అప్పలనాయుడు, సోములు, సారి కి చిన్న తదితరులు పాల్గొన్నారు.

పేద, బడుగు, బలహీన, శ్రామికవర్గాలకి రాజ్యాధికారమే లక్ష్యంగా 99 ఏళ్ళ సిపిఐ పోరాటాలు

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్

విజయనగరం టౌన్: బ్రిటిష్ పాలకుల నిర్బంధకాండకు, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా 1925 డిసెంబరు 26న కాన్పూర్ (ఉత్తరప్రదేశ్) గడ్డపై సిపిఐ ఆవిర్భ వించి గడిచిన 99 ఏళ్ళ కాలంలో ఎన్నో వీరోచిత పోరాటాలు, మహోన్నత త్యాగాలు, మహత్తర విజయాలకు సీపీఐ ప్రతీకగా నిలిచిందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ తెలిపారు. సిపిఐ 99వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం విజయనగరం నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో పి.డబ్ల్యు మార్కెట్ శాఖ, మార్ఫ్ నగర్ శాఖ, పడమర బల్లివీధి, మసీదు రిక్షా స్టాండ్ శాఖ, శాంతినగర్ శాఖలలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ నేతృత్వంలో సిపిఐ జెండాలు ఎగురవేశారు. ఈ సందర్భంగా బుగత అశోక్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో భారత దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని నినదించిన మొట్టమొదటి పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మాత్రమే అని తెలిపారు. ఆ తర్వాత దేశ ప్రజల

సామాజిక, రాజకీయ, ఆర్థిక హక్కుల కోసం సుదీర్ఘమైన గర్వకారణమైన పోరాటాలు అనేకం నడిపిందన్నారు. భారతదేశంలో నాడు తెల్ల దొరతనాన్ని తరిమికొట్టినప్పటికీ నేడు నల్ల దొరతనం రాజ్యమేలుతూనే ఉందన్నారు. ఆనాటి స్వాతంత్ర్య పోరాటంలో అగ్రభాగాన నిలబడిన ఘనత సిపిఐ కి ఉందన్నారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు కమ్యూనిస్టులను అరెస్టు చేసి మీరట్ కుట్ర కేసుల్లాంటి అనేక తప్పుడు కేసులు బనాయించి దశాబ్దాల పాటు జైళ్ళలో పెట్టారన్నారు. స్వాతంత్ర్యం తరువాత ప్రధాన ప్రతిపక్షంగా పార్లమెంటులో పనిచేసింది. ఈ విప్లవాత్మక, సాహసోపేతమైన ప్రస్థానం ఇప్పుడు 99వ సంవత్సరంలోకి అడుగు పెడుతోందన్నారు. కమ్యూనిస్టుల రక్తతర్పణతో, ఎందరో అమరుల త్యాగాల ఫలితంగా స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నుంచి పేద, బడుగు, బలహీన, శ్రామికవర్గాలకి రాజ్యాధికారం, సోషలిస్టు సమాజ స్థాపనే లక్ష్యంగా సీపీఐ అలుపెరుగని పోరాటాలు కొనసాగిస్తుందన్నారు. సోషలిస్టు సమాజంలోనే ప్రజలందరికీ సమాన అవకాశాలు, ప్రజాస్వామిక హక్కులు లభిస్తాయని జాతి, వర్గ, కుల, మత, లింగ వివక్ష, దురాగతాల అంతానికి సమ సమాజమే అవశ్యమని సిపిఐ విశ్వసించిందన్నారు. వెట్టి చాకిరి, బానిసత్వం కి వ్యతిరేకంగా పోరాడిందన్నారు. దున్నేవాడికె భూమి దక్కాలనే మొట్టమొదటిగా నినదించి పోరాడి భూస్వామ్య వ్యవస్థ పై భూపోరాటాల్లో ఎర్రజెండాలు నాటి లక్షలాది ఎకరాలను పేదలకు పంచిపెట్టిందన్నారు. సంస్థానాల్ని ప్రజలపరం చేసి రచరిక వ్యవస్థ మట్టుబెట్టిందన్నారు. రాజభరణాల రద్దు, బ్యాంకులు జాతీయకరణ చేయించడంలో సిపిఐ మిలిటెంట్ పోరాటాలు నడిపిందన్నారు. నిరంతరం ప్రజా శ్రేయస్సు కోరుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలూ శ్రమిస్తోందన్నారు. నేడు దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ, ఏనాడూ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ఛాయలు కనిపించని ఆర్ఎస్ఎస్ ప్రస్తుతం దేశ రాజకీయాల్లో చక్రం తిప్పే స్థాయికి చేరుకొని చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలు సాగిస్తున్నదన్నారు. గణతంత్ర, స్వతంత్ర భారత దేశాన్ని హిందూదేశంగా మార్చాలని ఆరాటపడుతోందన్నారు. అందుకోసం నరేంద్రమోడీ ప్రభుత్వం శాయశక్తులా కృషిచేస్తూ కార్పొరేట్ అనుకూల, ప్రజాకంటక విధానాలను అమలును వేగవంతం చేస్తోందన్నారు. ఈ క్రమంలో మోదీ సర్కారు రైతులు, సంఘటిత, అసంఘటితరంగాల కార్మికులు, శ్రామికులు, అణగారిన వర్గాల జీవితాలను పణంగా పెట్టిస్తోందన్నారు. పర్యవసానంగా అన్ని వర్గాల ప్రజల వెతలు వర్ణనాతీతమన్నారు. వారి హక్కులు కాలరాయబడుతున్నాయన్నారు. హిట్లర్ ని మరిపించే విధంగా మోడీ నియంతృత్వ విధానాలు అమలవు తున్నాయన్నారు. మోడీ కనుసన్నల్లో దేశంలో మతోన్మాదం పెచ్చరిల్లుతోందన్నారు. ప్రజాతంత్రవాదులపై నిరాఘాటంగా దాడులు జరుగుతున్నాయన్నారు. ఈ పరిస్థితులలో కేంద్రంలోని నరేంద్రమోడీ నేతృత్వం వహిస్తున్న ఆర్ఎస్ఎస్ సారధ్యంలో ఉన్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దెదించాలనే సంకల్పంతోటీ దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, లౌకిక వ్యవస్థను పరిరక్షించుకునే ఆశయంతో కమ్యూనిస్టులు కంకణబద్ధులు కావాల్సిన అవసరం ఉందన్నారు. ఆ స్ఫూర్తితో మహత్తర సిద్ధాంతాల వేదికగా ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ 99వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను జిల్లా వ్యాప్తంగా వాడవాడలా ఘనంగా నిర్వహించుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.రంగరాజు, బాయి రమణమ్మ, బుగత పావని, జిల్లా సమితి సభ్యులు బాలి గౌరినాయుడు, పార్టీ శాఖ కార్యదర్శులు పొందూరు రాంబాబు, పొందూరు అప్పలరాజు, ఎ.రాములు, కె. సూర్యనారాయణ, ఉంగరాల జయలక్ష్మీ, సూరిడమ్మ, సూర్యతేజ మరియు పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

భారతమాత ముద్దుబిడ్డ వాజపేయి

బిజెపి జిల్లా కార్యదర్శి దానేష్

విశాలాంధ్ర-లక్కవరపుకోట: దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయి భారతమాత ముద్దు బిడ్డని బిజెపి జిల్లా కార్యదర్శి దానేష్ తెలిపారు. సోమవారం నియోజకవర్గ సమన్వయకర్త వై ప్రసాద్ ఆధ్వర్యంలో జమ్మాదేవిపేట, మల్లివీడు గ్రామాల్లో నిర్వహించిన వికసిత్ భారత్ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాజపేయి జయంతి వేడుకలు నిర్వహించారు. దానేష్ మాట్లాడుతూ భారతదేశ అభివృద్ధికి వాజ్పేయి ఎనలేని సేవలు అందించారని, భారతరత్న అవార్డు ద్వారా దేశం ఆయన్ను గౌరవించిందని గుర్తు చేసారు. ఆయన పేరున సుపరిపాలనా దినోత్సవాన్ని మోడీ జరుపుతు న్నారని తెలిపారు. కన్వీనర్ ప్రసాద్ మాట్లాడుతూ భారతదేశ హైవే రంగానికి మూలపురుషుడుగా ప్రజల గుండెల్లో వాజ్పేయి నిలుచారన్నారు. వికసిత్ భారత్ ద్వారా పేదప్రజలకు అనేక సంక్షేమ పథకాల మోడి ప్రవేశపెట్టారని తెలిపారు. నమో డ్రోన్ దీదీ పథకం ద్వారా ప్రతీ మహిళా సంఘానికి ఎనిమిది లక్షల రూపాయలు ప్రధానమంత్రి అందివ్వ నున్నట్లు డి.సూర్యారావు తెలిపారు. అనంతరం 2024 క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీనేతలు అప్పారావు, ఆయాగ్రామాల సర్పంచులు, మండలస్థాయి వైద్యబృందం,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతి వేడుకలు

గజపతినగరం: బిజెపి కార్యాలయంలో సోమవారం దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు వాజ్పేయి చిత్రపటానికి గజపతినగరం నియోజకవర్గ కో కన్వీనర్ సరిది దుర్గాప్రసాద్ పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు సంస్కరణలో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత వాజ్పేయి కె దక్కిందన్నారు 1924 డిసెంబర్ 25న మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్ గ్రామంలో పేద కుటుంబంలో జన్మించిన వాజ్పేయి 1996 నుండి 2004 మధ్య మూడు పర్యాయాలు ప్రధానమంత్రిగా పనిచేశారని అన్నారు ఈ కార్యక్రమంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షులు ఆరిశెట్టి ఏడుకొండలు జిల్లా సెక్రెటరీ మండపాక భారతి ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు పొగిరి గౌరీ మజ్జి రామారావు నెల్లి ఆదినారాయణ లక్ష్మణ్ రిటైర్డ్ ప్రిన్సిపల్ ప్రకాష్ రావు బెల్లాన రాఘవ ఈశ్వరరావు ఓ బి సి మోర్చా నాయకులు సత్య రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు

విశాలాంధ్ర-భోగాపురం : ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు మంగళవారం ప్రారంభిస్తున్నట్లు ఎంపిడిఓ అప్పలనాయుడు తెలిపారు. క్రీడల పోటీలు భోగా పురం ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. మండల వ్యాప్తంగా సచివాలయలలో నమోదు చేసుకున్న క్రీడాకారులు మంగళవారం ఉదయం 10 గంటలకు హాజరుకావలిసిందిగా కోరారు. ఈ పోటీలు శాసన సభ్యులు బడ్డుకొండ అప్పల నాయుడు ఆధ్వర్యంలో అలాగే అధ్యక్షులు కుమారి ఉప్పాడ అనుషా రెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నామని అన్నారు.

ఎస్ఐగా ఎంపికైన కోటరావుకు పౌర సన్మానం

విశాలాంధ్ర-జామి: ఇటీవల ప్రకటించిన ఎస్ఐ ఫలితాలలో ఎస్ఐగా ఎంపికైన మండలంలోని వెన్నె గ్రామానికి చెందిన రంది కోటరావును గ్రామస్థులంతా కలిసి పౌరసన్మానం చేసారు. సోమవారం సోమ వారం గ్రామంలో ఏర్పాటు చేసిన సత్కార సభకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరక్టర్ చలుమూరి సత్యారావు, స్థానిక సర్పంచ్ చలుమైరి విజయలక్ష్మి స్థానిక ఎంపిటిసి, గ్రామ పెద్దలు హాజరయ్యారు. ముందుగా కోటరావు తల్లిదండ్రులైన రంది అర్జున,నారాయణమ్మ దంపతులను అభినందించారు. అనంతరం కోటరావుకు దుశ్శాలువ కప్పి సత్కరించారు. తమ గ్రామానికి పేరు ప్రఖ్యాతులు తెచ్చిన కోటరావు విధినిర్వహణలో ముందుకు వెళ్ళి మరిన్న ఉన్నత పదువుల పొందాలని గ్రామస్థులంతా ఆశీస్సులు అందజేసారు. గ్రామానికి మంచి పేరు తెస్తానని కోటరావు హామీ ఇచ్చారు.

బయిరెడ్డికి ఘననివాళి

విశాలాంధ్ర-నెల్లిమర్ల: జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ బైరెడ్డి సూర్యనారాయణ 29వ వర్ధంతి నెల్లిమర్ల పట్టణంలో సోమవారం నిర్వహించారు. స్థానిక బైరెడ్డి సూర్యనారాయణ కల్యాణ మండపంలో ఉన్న విగ్రహానికి టీడీపీ నాయకులు బైరెడ్డి నాగేశ్వరరావు, లెంక అప్పలనాయుడు, రెడ్డి వేణు తదితరులు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. సర్పంచ్ గా, ఎంపిపిగా, జడ్పీ చైర్మన్ గా సూర్యనారాయణ చేసిన సేవలను వారు కొనియాడారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ జ్ఞాపకార్థం చంపావతి నది వద్ద ఏర్పాటు చేసిన శివుడు, సత్య హరిశ్చంద్ర విగ్రహాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చందక శంకర్రావు, కలిశెట్టి కన్నంనాయుడు, బైరెడ్డి వెంకటరమణ, బైరెడ్డి కళ్యాణ్, బోలే కృష్ణమూర్తి, విజినిగిరి అప్పారావు పాల్గొన్నారు.

ఘనంగా క్రీస్తు జయంతి వేడుకలు

విశాలాంధ్ర-బొబ్బిలి : సమస్త మానవాళి జీవితాల్లో వెలుగు నింపటానికి క్రీస్తు ప్రభువు మానవ శరీరం ధరించి ఈ భువిపై జన్మించిన రోజే క్రిస్మస్ అని సైంట్ ఆండ్రూస్ లుదరన్ చర్చ్ ఫాథర్ రెవరెండ్ పి జాన్ విక్టర్ అన్నారు. సోమవారం మహారాణి పేటలోని లుదరన్ చర్చ్ నందు ఏఈఎల్సీర్చ్ డెలిగేట్ జెసి రాజు ఆధ్వర్యంలో క్రీస్తు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించి క్రిస్మస్ ట్రీ ని ఏర్పాటు చేశారు. విశ్వాసులు ప్రత్యేక గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా ఎన్నారై సీఈవో శ్రీనివాసన్, రోటరీ ప్రతినిధులు చంద్ర కిషోర్, శ్రీ హరి , రామ కృష్ణ లతో కలసి ఫాథర్ జాన్ విక్టర్ క్రిస్మస్ కేక్ ను కట్ చేసి వాక్య సందేశాన్ని అందించారు. చర్చ్ ఫాథర్ మాట్లాడుతూ పతితులను, పవిత్రులను, సజ్జనులను, పవిత్రులను దుర్మార్గులను సమదృష్టి తో ప్రేమించే మనసు ప్రతిఒక్కరు కలిగిఉండాలని బోధించారు. అనంతరం జె సి రాజు పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రంలో చర్చ్ ప్రతినిధి రమణ, డేవిడ్ జె విక్టర్ , మెర్సీ, ఝాన్సీ, శేఖర్, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-తెర్లాం/బాడంగి: బాడంగి మండలం గజరాయుని వలస గ్రామంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలు ప్రాంతంలో పాన్‌షాప్ వద్ద అరుగుపై కూర్చున్న నడిమింటి సత్యం(పెద్ద సత్యం)ను మాక్స్ బోలోరా వ్యాన్ నడుపుతున్న సతీష్ దాష్(23)వ్యక్తి అరుగుపై కూర్చొన్న సత్యం వ్యాన్‌తో ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అదు అక్కడికక్కడే మృతి చెందాడు.

ఆడుదాం ఆంధ్ర సభా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ

విశాలాంధ్ర-దత్తిరాజేరు: మరడాం జిల్లా పరిషత్ పాఠశాల గ్రౌండ్‌లో నేడు జరగబోయే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం యొక్క సభా స్థలాన్ని ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు సోమవారం సభా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా గజపతినగరం శాసనసభ్యులు బొత్స అప్పలనరసయ్య వస్తున్నారని మండలంలో ఉన్నటువంటి వైసిపి నాయకులు అందరూ తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోతల రామలక్ష్మి, ఎంపీటీసీ కొన్న లక్ష్మి, వైసిపి నాయకులు పోతల శంకర్రావు, కొన్న కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా లో పాల్గొనండి

యూత్ వింగ్ జోనల్ ఇంచార్జ్ అవనాపు విక్రమ్

విశాలాంధ్ర-విజయనగరం: యువ తంతా ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యూత్ వింగ్ జోనల్ ఇంచార్జ్ అవనాపు విక్రమ్ పిలుపునిచ్చారు. చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా డిసెంబర్ 26 నుంచి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలను నిర్వహిస్తుందన్నారు. పన్నెం డు కోట్లకు పైగా ప్రైజ్‌మనీ.. 30 లక్షలకు పైగా క్రీడాకా రులు.. 3 లక్షల పైగా మ్యాచ్ లు.. గేమ్స్ కు అవసరమైన కిట్ల పంపిణీ.. 8 వేలకు పైగా సిబ్బంది.. 9వేల మైదానాలలో .. 15 వేల సచివాలయలలో ఆటల పోటీలతో అతి పెద్ద కార్యక్రమం మన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిం దన్నారు. ప్రజారోగ్య పరిరక్షణ.. టాలెంట్ హంట్.. క్రీడా స్ఫూర్తిని నింపడం.. ప్రతిభకు పట్టం కట్టడం అనేవి ప్రధాన లక్ష్యాలుగా కొనసాగుతోన్న ఆడుదాం ఆంధ్రా ప్రజలందరి ఆట..భవిష్యత్ కి బంగారు బాట.. టాలెంట్ ను వెలికితీసే వేటగా.. అవనాపు అభివర్ణించారు. ఏ రంగానికి లేని గుర్తింపు ఒక క్రీడా రంగాని మత్రమే ఉంటుందని,ఒక క్రీడాకారుడికి మాత్రమే రాష్ట్రానికి, దేశానికి ప్రాతినిధ్యం వహించి,గుండెలపై త్రివర్ణపతాకాన్ని కప్పుకొని, దేశం తరపున ఆడే గొప్ప అవకాశం లభిస్తుందన్నారు. క్రీడాకా రుడు గెలిస్తే దేశం గెలిచినట్టేనన్న విషయాన్ని గుర్తుచేశారు. క్రీడాకారుల్లో టాలెంట్ ఉన్నా సరైన శిక్షణ లేకపోతే ఆ టాలెంట్ వృదా అవుతుందన్నారు. అందుకే మట్టిలో మాణి క్యాలు వెలికి తీసి, వారి టాలెంట్ కు పదును పెట్టేందుకు జగనన్న ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహి స్తుందని అన్నారు. క్రీడల పట్ల ఎంతో ఆసక్తి,ప్రేమ, ఉన్న వ్యక్తి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అని తెలిపారు. అందుకే క్రీడా రంగాన్ని ప్రోత్సహించేందుకు ఇంత పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని కొనియాడారు. అత్యధిక సంఖ్యలో యువత ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కొనసాగుతున్న అంగన్వాడీల సమ్మె

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలో అంగన్వాడీలసమ్మె 14వరోజుకు చేరింది. రోజుకొక రీతిలో నిరసన కార్యక్రమాలు చేస్తున్నామని వారు తెలిపారు. క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకొని సోమవారం జగనన్నకు మంచి బుద్ధిని కలిగించి అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కారం చేయాలని, క్రిస్టమస్ కేకును కట్ చేసి వారంతా కన్నీటి ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి జిల్లా కార్యదర్శి గంట జ్యోతిలక్ష్మి, పిరామలక్ష్మి, సెక్టార్ లీడర్లు ,అంగన్వాడీ కార్యకర్తలు ,సహాయకులు, సిటు మండల కార్యదర్శి గావర వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ సందర్భంగా అంగన్‌వాడీ సమ్మె వద్ద కేక్ కట్ చేసిన అంగన్‌వాడీలు

విశాలాంధ్ర-పార్వతీపురం/గుమ్మలక్ష్మీపురం: గుమ్మ లక్ష్మీపురం : క్రిస్టమస్ పండగ సందర్భంగా గుమ్మలక్ష్మీ పురం అంగన్వాడీ సమ్మె శిబిరం వద్ద కార్యకర్తలు, హెల్పర్లు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రామిక మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఆర్. ఇందిరా మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని గత 13 రోజులుగా అంగన్వాడీలు సమ్మెచేస్తున్న ప్రభుత్వం కాస్తయినా స్పం దించకపోవడం విచారకరం అన్నారు. అక్క చెల్లెమ్మలకు అండగా ఉంటానని ఆనాడు చెప్పిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈనాడు రోడ్లపైకి వచ్చి అంగన్వాడీలు నిరసనలు తెలుపుతుంటే సమస్యలను పరిష్కరించాలని కోరితే ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ పేర్కొన్నారు. క్రిస్టమస్ పండుగ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి మనసు మారి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తారని కోరుతున్నామని అన్నారు. అప్పటికి డిమాండ్లు నెరవేర్చకపోతే. అంగన్వాడీలకు సంఘీభావంగా ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు టి.సత్యవతి,వై. కస్తూరి, చెముదు గూడ ఎంపిటిసి మందంగి రమణ ఉన్నారు.

ఎమ్మెల్యే జోగారావు ఆధ్వర్యంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర-పార్వతీపురం: క్రిస్టమస్ పండుగ వేడుకలను ఎమ్మెల్యే అలజింగి.జోగారావు క్యాంప్ కార్యాలయం వద్ద సోమవారం ఘనంగా జరిగాయి.ప్రజలందరి సమక్షంలో ఎమ్మెల్యే తనకుటుంబంతో కలిసి క్రిస్మస్ కేకును కట్ చేసి అందరికీ తినిపించి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.పవిత్ర క్రిస్మస్ పండగ పర్వదినాన పార్వతీపురం నియోజకవర్గ కేంద్రంలో శాసనసభ్యులు అలజంగి జోగారావు సారథ్యంలో తన నివాసం వద్ద ప్రతి ఏడాది నిర్వహించిన మాదిరిగానే ఈఏడాదికూడా నియోజకవర్గ పరిధిలోనే కాకుండా జిల్లా పరిధిలో వేలాదిమంది ప్రజలకు అన్నదానం కార్యక్రమంతో పాటు పేద మహిళలకు వస్త్రదానంతో పాటు ఆర్థికసహాయం చేపట్టి తన దయాహృదయాన్ని చాటుకున్నారు.ఎమ్మెల్యేజోగారావుకు, ఆయన కుటుంబానికి క్రిస్మన్ శుభాకాంక్షలు తెలియజేసేందుకు నియోజకవర్గంతో పాటు జిల్లాపరిధిలోగల వేలాదిమంది వైసిపి శ్రేణులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఆత్మీయులు, శ్రేయోభిలాషులు, అధికారులు అన్నివర్గాలవారు తరలిరావడం గమనార్హం.ఎమ్మెల్యే గారి కుటుంబానికి క్రిస్మస్ శుభాకాంక్షలు ఘనంగా తెలియజేయడంతో పాటు వారందరి సమక్షంలో ఎమ్మెల్యే గారు కుటుంబంతో సహా కలిసి భారీ క్రిస్మస్ కేక్ కట్ చేసి వారందరికీ తినిపించి ప్రతి ఒక్కరికి క్రిస్మన్ శుభాకాంక్షలు ఎమ్మెల్యే తెలియచేయడం జరిగినది. అనంతరం ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేయడానికి విచ్చేసిన వారందరికీ ఆయన విందుభోజనాన్ని ఏర్పాటు చేసి అందరికీ స్వీకరించమని కోరారు .ప్రజలందరూ విందు భోజనాన్ని ఆరగించి సంతృప్తికరంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ భగవంతుడు మనకిచ్చిన దానిని తిరిగి మనతోటి వారికి సహాయం చేయడంలోనూ, వారితో పంచుకోవడంలో ఉన్న ఆనందం మరి ఎందులోను ఉండదని, ఈక్రిస్మస్ పర్వదినాన పార్వతీపురం నియోజకవర్గ ప్రజలందరూ కూడా సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని, యేసుప్రభువు ప్రేమను మీఅందరిపై ఎల్లవేళలా ఉండేలాచూడాలని కోరుకుంటున్నానని ఎమ్మెల్యే తెలియజేశారు. ఈకార్యక్రమంలో పార్వతీపురం నియోజకవర్గ పరిధిలోగల పార్వతిపురం రూరల్, సీతానగరం, బలిజిపేట మండలాలు, పట్టణ ప్రాంతాల పరిదిలో ప్రతి గ్రామంనుంచి, వార్డునుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయం కన్వీనర్లు, గృహసారధులు, అభిమానులు, శ్రేయోభిలాషులు, అధికారులు, కుటుంబ సభ్యులు, ఎంపీపీలు జడ్పిటిసిలు, పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, పిఏసిఎస్ చైర్మన్ లు, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు, స్టేట్ డైరెక్టర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహసారదలు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు, వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలు, కులసంఘాలు ఇలా అన్ని వర్గాల వారు విచ్చేసి ఎమ్మెల్యేకు పెద్ద యెత్తున శుభాకాంక్షలు తెలియజేశారు.

కార్యాలయ ప్రారంభ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు

టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి విజయ్‌చంద్ర

విశాలాంధ్ర-పార్వతీపురం: పార్వతీపురం నియోజకవర్గంలో ఆదివారం ప్రారంభం చేసిన టీడీపీ పార్టీ కార్యాలయ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన రాష్ట్ర,జిల్లా, వివిధ నియోజకవర్గాల నేతలకు, మూడు మండలాలు, పురపాలక సంఘంనాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, జనసేన శ్రేణులకు ధన్యవాదాలు తెలియ జేస్తున్నట్లు ఇంచార్జి బోనెల విజయ్ చంద్ర తెలిపారు.సోమవారం అయన విలేకరులతో మాట్లాడుతూ అంతా కలిసికట్టుగా విచ్చేసి విజయవంతం చేయడం ఏంతో ఆనందంగా ఉందన్నారు. ఇదిలా ఉండగా నియోజకవర్గంలోని ప్రజలకు, పార్టీశ్రేణులకు,నాయకులకు, కార్యకర్తలకు, అభిమాను లకు క్రిస్టమస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఆడుదాం ఆంధ్రాను విజయవంతం చేద్దాం : ఎమ్మెల్యే కళావతి

విశాలాంధ్ర-సీతంపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 26 నుండి నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను విజయవంతం చేసేందుకు యువత ముందుకు రావాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి పిలుపునిచ్చారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కళావతి మాట్లాడారు.క్రీడాకారులను ప్రోత్సహించేందుకు జగనన్న సర్కారు ఆడుదాం ఆంధ్రా' పేరుతో క్రీడా పోటీలను నిర్వహిస్తోందన్నారు. ఈనెల 26 నుండి వచ్చే ఏడాది ఫిబ్రవరి 10వ తేదీ వరకు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ,బ్యాడ్మింటన్, యోగా,టెన్నీకాయట్,మారథాన్ తదితర పోటీలను యువతకు నిర్వహిస్తారన్నారు. గ్రామ/వార్డు సచిలయాల పరిధిలో జనవరి 9 వరకు,మండల స్థాయిలో జనవరి 10 నుండి 23 వరకు, జనవరి 24 నుండి 30 వరకు నియోజకవర్గస్థాయిలో ,జనవరి 31 నుండి ఫిబ్రవరి 5 వరకు జిల్లా స్థాయిలో, ఫిబ్రవరి 6 నుండి 10 వరకు రాష్ట్ర స్థాయిలో 47 రోజుల పాటు సుదీర్ఘంగా ఈ పోటీలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కళావతి తెలిపారు ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు రూ.100 కోట్లు బడ్జెట్ ను సి.ఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి కేటాయించారన్నారు.క్రీడలతో ఉజ్వల భవిత ఉంటుందని ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టిడ్కో చైర్మన్ కు క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలిపిన నాయకులు,అభిమానులు

విశాలాంధ్ర- పార్వతీపురం: రాష్ట్ర టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ స్వగృహంలో సోమ వారం క్రిస్టమస్ పండుగ వేడు కలు ఘనంగా జరిగాయి. నియోజక వర్గంలోని మూడు మండలాలతో పాటు పట్టణ అభిమానులు, వైఎస్సార్సీపీ నాయకులు, టిడ్కోఅధికారులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులు పెద్దఎత్తున పాల్గొని ఆయనకు బోకేలు అందజేసి క్రిస్టమస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. వచ్చిన వారందరికీ ఆయన విందును ఏర్పాటు చేశారు.

14వ రోజు సమ్మెలో సిటూ నాయకులు

విశాలాంధ్ర-బెలగాం : అంగన్వాడి వర్కర్స్ & హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు లీడర్స్ మర్రాపు అలివేలు, సాలూరు గౌరీమణి, సెక్టార్ లీడర్లు కె.రాజేశ్వరి, ఎం.గౌరి, సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, సిఐటియు నాయకులు బొత్సలక్ష్మి ఆధ్వర్యంలో 14వ రోజు సమ్మెలో భాగంగా పార్వతీపురం కలెక్టరు కార్యాలయం బయట సమ్మె శిభిరంలో క్రిస్టమస్ సందర్భంగా బాలఏసు విగ్రహానికి ప్రార్థనలు చేసి కేక్ కట్ చేసారు. అనంతరం స్వీట్స్, కేకు ఒకరిరికి తినిపించుకొని అందరికి పంచారు. ప్రభుత్వం మా సమస్యలు పరిష్కారం చేయాలని హ్యాపి హ్యాపి క్రిస్టమస్ మేరీ మేరీ క్రిస్టమస్ అని నినాదాలు వినూత్న రీతిలో ఇచ్చారు. బుడబుగ్గని వానితో పాటలు పాడించారు. అంగన్వాడీలకు సిఐటియు నాయకులు బంకురు సూరిబాబు, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు, యుటిఎఫ్ నాయకులు మురళిమోహన్ జిల్లా అధ్యక్షులు రమేష్ కవి, కళాకారులు పక్కి ఉమా మాష్టారు, కె. మురళి, పూడి వెంకటనాయుడు మాష్టారు మద్దతు తెలిపారు. అనంతరం యుటిఎఫ్ తరుపున పదివేల రూపాయలు అంగన్వాడీలకు విరాళం ఇచ్చారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ కనీస వేతనం 26,000/ రూపాయలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, ముఖ్యమంత్రి హామీ అమలు చేయాలని అంతవరకూ సమ్మె కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ లీడర్స్ టి. రాజేశ్వరి, బి. నీలవేణి, పార్వతి, ధర్మావతి, లలిత అధిక సంఖ్యలో అంగన్వాడి వర్కర్లు హెల్పర్లు పాల్గొన్నారు.

మన్యం లో కందికొత్తల నగరా....సంబరాల్లో గిరిజనం

విశాలాంధ్ర-కురుపాం: మన్యంలో కందికొత్తల నగారా మోగింది.ప్రతీఏటా కందిపంట చేతికొచ్చే సమయంలో గొడ్డలమ్మకు చెల్లింపు ఇచ్చే సంబరమే కందికొత్తల పండుగ. ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలలో ముఖ్య మైన పండుగ కందికొత్తలు గిరిజన సంప్రదాయ వాయిద్యాలు, ఎట్జోడి పూజలుతో ప్రతీకగా నిలిచే కంది కొత్తల పండగ గిరిజనుల ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తోంది. గిరిజన ఆచార, సంప్రదాయాలను ప్రతి బింబిస్తుంది. మన్యం వాసుల్లో ఆనందాన్ని, ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని నింపుతుంది. గిరిజనులకు అటవీ ప్రాంతాలతో విడదీయరాని అనుబంధం. కందికొత్తల పండగ గిరిజన ప్రాంతాల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. గిరిజన దేవతలు గొడ్డళ్లమ్మ, సత్తరామ్మను ఆడవి నుంచి గ్రామానికి తీసుకొచ్చి యజ్ఞోడు పూజిస్తారు. గిరిజన గ్రామాల్లో పండిన పంటలు ముందుగా ఈ దేవతలకు బోనాలు పెట్టిన తర్వాతే వీరు భుజిస్తూ ఉంటారు. డప్పు వాయిద్యాలతో ఊరేగిస్తారు. ఐదు రోజుల పాటు పరిశర గ్రామాల్లో గొడ్డలమ్మను ఊరేగింపు చేసి జోగిదండుతారు...ఇలా వచ్చిన బియ్యం ,డబ్బులు తో ,కొత్త కందులను కలిపి సహపంక్తి బోజనాలను చేస్తారు. . ప్రతి ఏటా సం క్రాంతి ముందుగా గిరిజన గ్రామాల్లో గిరిజనులు పెద్ద ఎత్తున ఈ కందికొత్తల ఉత్సవాలు నిర్వ హిస్తుండటం ఆనవాయి తీగా వస్తోంది.

ఘనంగా క్రిస్టమస్ వేడుకలు

విశాలాంధ్ర-సీతంపేట: మండలం పరిధిలోని విచారణలోని లొయోలా సంస్థ ఆధ్వర్యంలో పత్తికగూడలోని ఆర్సీయం చర్చి వద్ద క్రిస్టమస్ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విచారణ గురువులు విద్యాసాగర్, పీటర్ ల ఆధ్వర్యంలో క్రిస్టమస్ ఆరాధన జరిపించారు. ఆరాధనలో భాగంగా బాలయేసు పుట్టుకను తెలియజేసే నాటికను ప్రదర్శించారు. ఆరాధన అనంతరం క్రిస్టమస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఈ కార్యక్రమంలో మఠకన్యలు ఝాన్సీ, సుదీప్త, పెద్ద సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

డాక్టర్ వరలక్ష్మి పబ్లిక్ స్కూల్లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర-శృంగవరపుకోట : క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని డాక్టర్ వరలక్ష్మి పబ్లిక్ స్కూల్ వ్యవస్థాపకురాలు డాక్టర్ వరలక్ష్మి సూచనలు మేరకు పాఠశాలలో ప్రిన్సిపాల్ కండిపల్లి రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా క్రీస్మస్ వేడుకల సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యనాటికలు, వివిధరకాల వేషధారణాలతో అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కండిపల్లి రమేష్ మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వంగా మన భారత దేశం ప్రపంచలోనే ఆదర్శవంతమైన దేశంగా నిలిచిందని తెలిపారు. అలాగే ఈ దేశ భావి పౌరులు అయిన అందరు కుల మతాలకు అతీతముగా అందరూ కలసి మెలసి ఉన్నతమైన భవిష్యత్ ను నిర్మించుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చిన్నారులు సంతక్లజ్ వేశాధారణతో అందరికి బహుమతులు అందజేసారు.

సామాజిక సేవా కార్యక్రమాలకు ఇన్నర్ వీల్ క్లబ్ స్ఫూర్తి ప్రదాత

క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ శ్రీదేవి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణకు ఇన్నర్ వీల్ క్లబ్ స్ఫూర్తి ప్రదాత అని క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ జి.శ్రీదేవి పేర్కొన్నారు. సోమవారం ఆమె క్లబ్ అధికారిక పర్యటనలో భాగంగా విజయనగరం విచ్చేశారు. పట్టణంలో పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కొత్త అగ్రహారంలోని పురాతన బిపిఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సుమారు 80 వేల రూపాయలతో సైన్స్ లేబ్ ను ఆధునికరించి పరికరాలను అందజేసి లాబ్ ను ప్రారంభించారు. అనంతరం మరో 90 వేల రూపాయలతో తోటపాలెంలోని కైలాస భూమికి పరికరాలను సమకూర్చారు. అనంతరం గంటస్తంభం వద్ద గల మహిళా పార్కును పరిశీలించి మరో 14 వేల రూపాయలతో కొత్తగా బెంచీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీదేవి మాట్లాడుతూ విజయనగరం ఇన్నర్ వీల్ క్లబ్ ప్రతినిధులు చేపడుతున్న సేవా కార్యక్రమాలు సామాజిక ప్రయోజనకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం తదితర సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమైనవని తెలిపారు. విజయనగర ఇన్నరవెల్ క్లబ్ అధ్యక్షురాలు కాపుగంటి సుధ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి సంధ్యారమ తో పాటు ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వాడవాడలా ఘనంగా క్రిస్టమస్ వేడుకలు

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని అన్నిగ్రామాల్లో ఆదివారం అర్ధరాత్రినుండి క్రిస్టమస్ పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. చర్చిలన్నీ విద్యుద్దీకరణతో అలంకరణ చేయబడ్డాయి. పెదభోగిలి, సీతానగరం, చినభోగిలి, బూర్జ, గుచ్చిమి, లచ్చయ్యపేట, మరిపి వలస, పనుకుపేట, అంటిపేట, గాదెలవలస, నిడగల్లు, కాసాపేట, తామరఖండి, లక్ష్మీపురం, జోగమ్మపేట, పెదంకలం, గెద్దలుప్పి తదితర గ్రామాల్లో క్రైస్తవ సోదరులు చర్చిలకు వెళ్లి పూజలు చేశారు. ఆయా చర్చిలఫాదర్లు ప్రసంగాలుచేసి జీసస్ క్రీస్తు బోధనలు వింపించి సన్మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. చినభోగిలి గ్రామంలో చిన్న బాలయేసును పురవీధుల్లో ఫాదర్ వర్గీస్ ఆధ్వర్యంలో ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ కురమాన రాధశ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. పెదభోగిలి చర్చిలో మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్సీ కమీషన్ సభ్యురాలు సవరపు జయమణి పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు.

నగర అభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : నగర అభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. సోమవారం కంటోన్మెంట్లోని ఎస్బిటి మార్కెట్ జంక్షన్లో రోటరీ క్లాక్ టవర్ ను ఆయన లాంఛనుగా ప్రారంభించారు. రోటరీ క్లబ్ స్వచ్ఛంద సంస్థ పైలన్ రూపంలో క్లాక్ టవర్ ను 8 లక్షల రూపాయలతో నిర్మించారు. దీంతో ఆ ప్రాంతం ప్రత్యేకత సంతరించుకుంది. రోటరీ క్లాక్ టవర్ ని ప్రారంభించిన అనంతరం మీడియాతో కోలగట్ల వీరభద్ర స్వామి మాట్లాడుతూ కార్పొరేషన్ స్థాయికి అవతరించిన తర్వాత నగరానికి అదే స్థాయి హంగులను ఏర్పాటు చేసేందుకు కృషి చేశామన్నారు. రోటరీ క్లబ్ అంధిస్తున్న సేవలు మరువ రానివని అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గతంలో స్వర్గధామం, బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేసిన సమయంలో తానే శాసనసభ్యుడిగా ఉండడం ఆనందంగా ఉందన్నారు. మరలా ప్రస్తుత ప్రాజెక్టు కూడా తన హయంలో జరిగిందని గుర్తు చేశారు. రోటరీ క్లబ్ ప్రతినిధులు కోరిన వెంటనే పేద రోగులకు డయాలసిస్ సెంటర్ ను ఏర్పాటు చేసేందుకు 430 గజాల స్థలాన్ని సమీకరించి అందజేశామన్నారు. సమాజం బాగుంటే అందులో ఉన్న మనమంతా బాగుంటామని అన్నారు. సామాజిక సేవ చేసే వారికి వెనుదన్నుగా నిలుస్తామని అన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ గవర్నర్ రావూరి దత్త సుబ్బారావు, అధ్యక్షులు డా. కృష్ణ శాంతి, కమ్యూనిటీ సర్వీస్ డైరెక్టర్ డా.తిరుమల ప్రసాద్, కార్యదర్శి నీతావిజ్వాణి, ప్రాజెక్ట్ చైర్మన్ పోలిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అందరూ సహృదయంతో జరుపుకునే పర్వదినమే క్రిస్మస్

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : అందరూ సహృదయంతో జరుపుకునే పర్వదినమే క్రిస్మస్ అని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. సోమవారం క్రిస్మస్ ను పురస్కరించుకొని స్థానిక మెయిన్ రోడ్ లో ఉన్న సిమ్స్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చిలో ఘనంగా జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. మత పెద్దలు ముందుగా ప్రత్యేక ప్రార్థనలు జరిపి క్రిస్మస్ కేకులు కట్ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ ఏసుప్రభువు అందరికీ మంచి మార్గ నిర్దేశకులని అన్నారు. ప్రపంచానికి శాంతి దూతగా వెలుగొందుతున్న ఏసు ప్రభు మార్గం అందరికీ అనుసరణీయమని అన్నారు. ప్రభువు సూచించిన మార్గంలో నడిచిన వారికి మంచి విజయాలు చేకూరాయని స్పష్టం చేశారు. ఏసుప్రభువు అంటే ఒక నమ్మకం, ఒక ధైర్యం అని అన్నారు. అదేవిధంగా చర్చిలలో ప్రార్థనలు చేస్తున్నప్పుడు అదే ధైర్యాన్ని నమ్మకాన్ని ప్రజలకు అందిస్తున్నారన్న విషయాన్ని గ్రహించాలన్నారు. ప్రతి సంవత్సరం క్రిస్మస్ వేడుకలు అంతకంతకు ఘనంగా జరగడం భక్తి విశ్వాసానికి ప్రతిరూపమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-నెల్లిమర్ల: వెనుకబడిన తరగతుల ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న శ్రీ విశ్వకర్మ యోజన పథకాన్ని అర్హులైన ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గొలగాన రమేష్ పిలుపునిచ్చారు. నెల్లిమర్ల పట్టణంలోని ఆదిత్య విద్యాలయంలో పథకానికి సంబంధించి అవగాహన సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోవిడ్ అనంతరం అనంతరం ఏర్పడిన ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో వెనుకబడిన తరగతుల ప్రజలకు బాసటగా నిలవాలనే ఉద్దేశ్యంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పథకాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. పథకం ద్వారా చేతి వృత్తుల వారికి రూ 1 లక్ష నుంచి రూ 5 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తుందన్నారు. ఎటువంటి హామీ లేకుండా కేవలం 5 శాతం వడ్డీకే రుణాలు అందజేస్తున్నట్లు చెప్పారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన ప్రజలు రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని రమేష్ సూచించారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గిడుతూరి రాము, కార్యదర్శి వి సూరిబాబు పాల్గొన్నారు.

వింతపుట్టుక ఒకతల, 8 కాళ్ల మేకపిల్ల



విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్ : మండలంలో గల పుట్టూరు పంచాయతీ దిబ్బగుడ్డి వలస గ్రామం బేత లక్ష్మణరావు పొలములో సూరంపేట గ్రామంకు చెందిన రామకృష్ణ అనే కోణారి యొక్క గొర్రెల మంద ఆయడం జరిగింది ఈ గొర్రెల మందలో సుమారు రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఒకతల్లి మేక ఒక తల ఎనిమిది కాలు గల పిల్ల మేకకు జన్మనిచ్చింది వింతగా పుట్టిన ఈ మేక పిల్లను చూడడానికి గ్రామ ప్రజలు పరుగులు తీశారు ఎన్నడూ ఒక తల ఎనిమిది కాలుతో పుట్టిన మేకపిల్లను చూడలేదని గ్రామ ప్రజల ఆశ్చర్యానికి గురయ్యారు గొర్రెల కాపరి రామకృష్ణ మాట్లాడుతూ నేను ఎన్నో సంవత్సరాల నుండి గొర్రెలు పెంచుతూ కాపరిగా ఉన్నానని ఇటువంటి వింత పుట్టుకతో పుట్టిన మేక పిల్లని ఎప్పుడూ చూడలేదని అన్నారు

నేటినుంచి ఆడుదాం ఆంధ్రా....! క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటెన్, ఖోఖో, కబడ్డీ పోటీలు

పోటీల్లో పాల్గొననున్న 1,42,728 మంది క్రీడాకారులు

క్రీడా సంబరానికి ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర-విజయనగరం : నేటి నుంచి జిల్లాలో భారీ క్రీడా సంబరం ప్రారంభం కానుంది. సచివాలయ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు వివిధ స్థాయిల్లో జరిగే ఈ పోటీల్లో వందలాది మంది క్రీడాకారులు పాల్గొనేందుకు రంగం సిద్దమయ్యింది. గ్రామీణ స్థాయిలో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ పోటీల్లో విజేతలకు స్పోర్ట్స్ కిట్లు, మెమెంటోలు, నగదు బహుమతులు ఇవ్వనున్నారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటెన్, ఖోఖో, కబడ్డీ క్రీడాంశాల్లో మంగళవారం నుంచీ జిల్లా వ్యాప్తంగా పోటీలు ప్రారంభం కానున్నాయి. ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు గత నెల 20 నుంచి తమ పేర్లను సచివాలయాల్లో ఉచితంగా పేర్లను రిజిస్టర్ చేయించుకున్నారు. ఇలా ఇప్పటికు వరకు సుమారుగా లక్షా, 42 వేల, 728 మంది క్రీడాపోటీలకు పోటీలకు ముందుకు వచ్చారు. ఇప్పటికీ కూడా క్రీడల్లో పాల్గొనేందుకు సిద్దపడే వారికి అవకాశాన్నికల్పించాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటెన్, ఖోఖో, కబడ్డీ క్రీడాంశాల్లో ఈ పోటీలు జరుగతాయి. క్రీడల నిర్వహణను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జిల్లా యంత్రాంగం, వీటిపై ఇప్పటికే విస్తృత ప్రచారాన్ని నిర్వహించింది. ప్రతీ గ్రామంలో, మండల కేంద్రాల్లో పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించారు. జట్లుగా ఆడే క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలకు ఇప్పటివరకు 12188 జట్లను ప్రత్యేక యాప్ ద్వారా రూపొందించారు. మిగిలిన క్రీడాకారులు వ్యక్తిగతంగా పోటీల్లో తలపడతారు. పోటీలకు అవసరమైన సుమారు 20,296 క్రీడా పరికరాలను ఆయా గ్రామాలకు తరలించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 342 క్రీడా మైదానాల్లో పోటీలు జరగనున్నాయి. జిల్లాలోని 626 సచివాలయాల పరిధిలో క్రీడాపోటీలు జరగనుండగా, వీటి నిర్వహణలో సహకరించేందుకు 6,260 మంది క్రీడా వాలంటీర్లను ఎంపిక చేశారు. వీరందరికి ఇప్పటికే శిక్షణ పూర్తి చేసి, అవసరమైన పరికరాలను అందజేశారు. కొంతమంది ఉత్సాహవంతులైన క్రీడాకారులు ఒకటి కంటే ఎక్కువ క్రీడల్లో పాల్గొనేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 6 వేల మ్యాచ్‌లు జరగనున్నాయి. డిసెంబరు 26 నుంచి జనవరి 9 వరకు సచివాలయ స్థాయిలో, జనవరి 10 నుంచి 23 వరకు మండల స్థాయిలో, జనవరి 24 నుంచి 30 వరకు నియోజకవర్గ స్థాయిలో, జనవరి 31 నుంచి ఫిబ్రవరి 5 వరకు జిల్లా స్థాయిలో పోటీలు జరుగుతాయి. ఆసక్తి ఉండి 15 ఏళ్లు పైబడిన వారికి ఈ పోటీల్లో పాల్గొనేందుకు ప్రభుత్వం అవకాశాన్ని కల్పించింది. ప్రతి సచివాలయం పరిధిలో క్రీడా మైదానాలను ఇప్పటికే సిద్ధం చేసి, క్రీడా సామగ్రిని తరలించారు. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి విజేతలకు నగదు బహుమతి ఉంటుంది. సచివాలయ స్థాయిలోని విజేతలకు స్పోర్ట్స్ కిట్లను బహుమతిగా ఇస్తారు. క్రీడాకారులకు మైదానం వద్దే భోజన సదుపాయాన్ని కల్పించారు. త్రాగునీరు, ప్రథమ చికిత్సా కేంద్రాలను కూడా ఏర్పాటు చేశారు. జట్ల మధ్య జరిగే పోటీల స్కోర్ బోర్డును ఆఫ్‌లైన్‌తో బాటు ఆన్ లైన్ ద్వారా కూడా ప్రదర్శిస్తారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ పర్యవేక్షణలో విద్యాశాఖ, పంచాయితీరాజ్, వైద్యారోగ్యశాఖ, గ్రామీణ నీటి సరఫరా తదితర వివిధ ప్రభుత్వ శాఖల భాగస్వామ్యంతో యువజన సర్వీసుల శాఖ ఈ క్రీడా పోటీలను నిర్వహిస్తోంది.

ఆడుదాం ఆంధ్రా పోటీల వివరాలివి...

పోటీలు జరగనున్న సచివాలయాలు : 626, స్పోర్ట్స్ వలంటీర్లు : 6260, క్రీడా మైదానాలు : 342, క్రీడా పరికరాలు : 20,296, పేర్లు నమోదు చేసుకున్న క్రీడాకారులు : 142728, పురుషులు : 75873, స్త్రీలు : 27505, మొత్తం జట్లు : 12188, మహిళల జట్లు : 3592, పురుషుల జట్లు : 8596 ఉన్నారు.

లక్ష్య ఫౌండేషన్ వక్తృత్వపు పోటీలకు విశేష స్పందన

విశాలాంధ్ర-శృంగవరపుకోట: లక్ష్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో "మానవ సంబంధాలపై మొబైల్ మరియు సోషల్ మీడియా ప్రభావం" అనే అంశంపై జరిగిన వక్తృత్వ పోటీలో విజేతలను సోమవారం ప్రకటించారు. "లక్ష్య ఫౌండేషన్" ఆధ్వర్యంలో ఎస్ కోట, ఎల్ కోట, కొత్తవలస, జామి, గంట్యాడ, వేపాడ తదితర మండలాల ప్రభుత్వ పాఠశాలలో 8,9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఎస్.కోట చైతన్య జూనియర్ కళాశాలలో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో 16 ప్రభుత్వ పాఠశాలకు చెందిన 110 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో ధర్మవరం పాఠశాల కు చెందిన మీసాల గోపిక ప్రథమ స్థానం, గొల్జాం పాఠశాలకు చెందిన ఆర్ పూజిత ద్వితీయ స్థానం, పెంట శ్రీరాంపురం పాఠశాలకు చెందిన సౌమ్య తృతీయ స్థానం, గొల్జాం పాఠశాలకు చెందిన వి.హేమంత్ చతుర్థ స్థానం, మధనాపురం ఏ పి మోడల్ స్కూల్ కు చెందిన డి.వనిత ఐదవ స్థానం సాధించినట్లు లక్ష్య ఫౌండేషన్ నిర్వాహకులు చీమలపాటి శర్మ , అజ్జాడ నరేష్, వెంపదాపు ఈశ్వరరావు, బండారు మోహన్, రహీం షేక్ లాల్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి విద్యార్థిని తన వాగ్ధాటి తో ప్రసంగించి ఆహుతులను అలంకరించారు. కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలుగా బి.కిరణ్, గనివాడ అప్పలరాజు, వై.విజయలక్ష్మి, శీల కోటేశ్వరరావు, ఇమంది శ్రీను, బి.వీర్రాజు వ్యవహరించారు. ప్రథమ స్థానం పొందిన విద్యార్థులకు రూ.5000, ద్వితీయ స్థానం పొందిన విద్యార్థులకు రూ.3000, తృతీయ స్థానం పొందిన విద్యార్థులకు రూ.2000, చతుర్ధ స్థానం పొందిన విద్యార్థికి రూ.1500, ఐదో స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.1,000, ఆరు నుండి పది స్థానాలు సాధించిన 10మంది విద్యార్థులకు చెరో రూ.500 చొప్పున బహుమతులు, 11 నుండి 25 స్థానాలు పొందిన విద్యార్థులకు కన్సోలేషన్ బహుమతులు, పాల్గొన్న అందరికి పార్టిసిపేషన్ బ ు ు వ ం త ు ల ం అందజేశారు. ఈ కార్యక్రమానికి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ విద్యార్థిని కర్రి పవిత్ర లహరి ఆర్థిక సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా ట్రెజరీ అధికారి టీ.సన్యాసిరావు, ఏతఅ కోన విజయ్, జామి డిప్యూటీ తహశీల్దార్ సునీత, ఉపాధ్యాయులు ఆకుల శ్రీనివాసరావు, సీహెచ్ అప్పలనాయుడు, అరుణ, అప్పారావు, విజయ, అప్పన్న , కే హేమ దివ్య, సత్య సాయితి, ఏదువాక వినయ్, కే శ్రీనివాసరావు, కొట్యాడ, గొల్జాం పాఠశాలల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వేపాడలో మనుస్మృతి పత్రాల దహనం

పాల్గొన్న దళిత నాయకులు, యువకులు

విశాలాంధ్ర-వేపాడ: మండల కేంద్రం వేపాడలో ఏపి దళిత కూలీ రైతు సంఘం, మండల మాలమహానాడు నాయ కులు, యువకులు సోమవారం మనుస్మృతి పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా దళితనేత దేబార్కి కిరణ్ మాట్లాడుతూ కులాల పేరుతో ప్రజల్లో పేరుకుపోయిన బానిసత్వాన్ని రూపు మాపటానికే నాడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ మను స్మృతిని తగలబెట్టారన్నారు. కులాలను విడగొడుతూ రాసిన అధమ శాస్త్రాన్ని అంబేద్కర్ ఇదే రోజున తగలబెట్టారన్నారు. భారతదేశాన్ని ముస్లింలు, బ్రిటిష్ వారు పరిపాలించి మనల్ని బానిసలను చేస్తే నేటి రాజకీయ నేతలు కులాల పేరుతో బానిసలను చేస్తున్నారన్నారు. దీనిని ఐక్యతతో సమైక్యంగా ఎదుర్కొని భారతావనిని వి దగొట్టాలని చూస్తే సహించబోమని మండల మాలమహానాడు అద్యక్షుడు దేబార్కి కిరణ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపి దళిత కూలీ సంఘం నాయకులు యువకులు పాల్గోన్నారు.

నేడు దేశపాత్రునిపాలెంలోని పైలాన్ నుండి బొడ్డవర వరకు బైక్ ర్యాలీ

ఎమ్మెల్సీ రఘురాజుకి స్వాగత ఏర్పాట్లు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: మళ్ళీ మన రాష్ట్రానికి జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలనే సంకల్పంతో మన ప్రియతమ ఎమ్మెల్సీ ఇందు కూరి రఘురాజు చేపట్టిన జయ హెూ జగనన్న పాదయాత్ర దిగ్విజయంగా పూర్తిచేసుకుని తిరిగి వస్తున్న సందర్భంగా ఎస్.కోట నియోజకవర్గ వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మంగళవారం మధ్యాహ్నం 2:00 గంటలకు కొత్తవలస మండలం, దేశపాత్రునిపాలెం వద్ద గల ప్రజా సంకల్పయాత్ర పైలాన్ నుండి బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్నట్టు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అభిమానులు, నాయకులు సోమవారం వెల్లడించారు. ఈ బైక్ ర్యాలీ పైలాన్ వద్ద నుండి బయలుదేరి 2:30 గంటలకు కొత్తవలస జంక్షన్, 2:50 గంటల కు గోల్డ్ స్టార్ జంక్షన్, 3:15 గంటలకు ఎల్.కోట, 4:00 గంటలకు ఎస్.కోట దేవిగుడి జంక్షన్ గుండా కొనసాగి 4:30 గంటలకు బొడ్డవరలో గల ఎమ్మెల్సీ రఘురాజు స్వగృహానికి చేరుకుంటుందని తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ రఘురాజు విలేకరులతో సమావేశం నిర్వహించనున్నారని వివరించారు.

22 గ్రామపంచాయతీలో క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర-రామభద్రపురం: మండలంలోని 22 గ్రామపంచాయతీలో క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. వేకు జామున కొవ్వొత్తిలతో వీధులలో ర్యాలీ నిర్వహించారు. రామభద్రపురం, కొట్టక్కీ, రొంపల్లి, ఆరి క చర్చలలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి గీతాలాపన చేశారు. చర్చికి వచ్చి ప్రతి ఒక్కరూ నూతన వస్త్రాలు ధరించి చర్చిలో ఆయా ఫా దర్ ఆధ్వర్యంలో ప్రార్థన చేశారు.

ఎమ్మెల్యేకు క్రిస్టమస్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన, ప్రజాప్రతినిధులు

విశాలాంధ్ర-సీతానగరం: సోమవారం క్రిస్టమస్ పండుగ సంధర్భంగా మండలంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు పెద్దఎత్తున పార్వతీపురం తరలివెళ్లి ఎమ్మెల్యే జోగారావుకు బోకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు చెప్పినవారిలో ఎంపిపి బలగ రవణమ్మ శ్రీరాములునాయుడు, జెడ్పీటీసీ బాబ్జి, మండల వైఎస్ఆర్సీపీ అధ్యక్షుడు బొంగు చిట్టిరాజు, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు పోల ఈశ్వరనారాయణ, ఎంపిడిఓ ప్రసాద్,తహశీల్దార్ ఎన్వీ రమణ, ఎస్ఐ రాజేష్,ఈఓపిఆర్డీ కుమార్ వర్మ, వ్యవసాయ అధికారి అవినాష్, వివిధ శాఖల అధికారులు,సర్పంచులు,ఎంపీటీసీలు, నాయకులు,అభిమానులు తదితరులు అన్నారు.

శ్రీపరదేశమ్మ ఆలయానికి 80బస్తాల సిమెంట్ వితరణ

విశాఖలోని చాపా చారిటబుల్ ట్రస్ట్ ఆపన్న హస్తం

హర్షం వ్యక్తం చేసిన ఆలయ కమిటీ సభ్యులు

విశాలాంధ్ర-వేపాడ:- మండలంలోని బానాది గ్రామంలో నిర్మాణంలో ఉన్న శ్రీ పరదేశమ్మ ఆలయానికి విశాఖపట్నం నగరానికి చెందిన చాపా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం 80బస్తాల సిమెంట్ ను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు చాప బాలకృష్ణ మాట్లాడుతూ గ్రామంలోని యువత విశాఖలో వలస జీవనం గడుపుతూ జన్మభూమి లో ఆలయ నిర్మాణం జరపాలన్న తపన కలిగి ఉండడం అభినందనీ యమన్నారు. సొంత నిధులతో వెయ్యి గజాల స్థలం కొని గొప్ప సంకల్పంతో ఆలయ నిర్మాణానికి పూనుకోవడం, ఈ ఆలయ నిర్మాణానికి ట్రస్ట్ ద్వారా 80బస్తాల సిమెంట్ అందించే భాగ్యం కల్పించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఆలయ కమిటీ సభ్యులు గుమ్మడి చిన్నాయుడు మాట్లాడుతూ సొంత గ్రామంలో ఇలవేల్పుగా భాసిల్లుతున్న శ్రీ పరదేశమ్మ తల్లి గుడి నిర్మాణం ప్రారంభం నుంచి సహకరిస్తున్న దాతలందరికి ధన్యవాదాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సహకారంతో తిరుమల తిరుపతి దేవస్థానం రూ 10లక్షల నిధులు మంజూరు కాగా ఇప్పటికే మూడు లక్షల బిల్లులు చెల్లించారన్నారు. ఆలయ నిర్మాణం పూర్తి చేసిన తర్వాత మిగిలిన 7లక్షలు విడుదల చేస్తారన్నారు. నిర్మాణం పూర్తి చేసేందుకు ఇంకా అమ్మవారి విగ్రహం, ఇసుక, సిమెంట్, ఫ్లోరింగ్ టైల్స్, ద్వారబంధం, తలుపులు, ప్రహరీ గోడకు గేటు అవసరం కాగా భక్తులు ముందుకొచ్చి తోచినంత సాయం అందించాలని కోరారు. దాతలు సెల్ నెంబర్ 8125409699 లో సంప్రదించి సాయపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుమ్మడి సత్తిబాబు, గణేష్, గంగాధర్, కన్నం నాయుడు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు రగ్గులు పంపిణీ చేసిన నాగవంశ సంక్షేమ సంఘం

విశాలాంధ్ర-విజయనగరం: నాగవంశం కులస్థుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ వివిధ సేవా కార్యక్రమాలు చేస్తున్నామని నాగవంశం సంక్షేమ సంఘం అధ్యక్షులు అవనాపు విక్రమ్ అన్నారు. విజయనగరం పట్టణంలోని సంఘం భవనంలో సోమవారం వృద్ధులకు సంఘ ప్రతినిధులు రగ్గులు పంపిణీ చేశారు. నాగవంశం కులస్థులకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా నాగవంశం సంక్షేమ సంఘం నుండి ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తామని సంఘం అధ్యక్షులు అవనాపు విక్రమ్ ఈ సందర్భంగా తెలియజేశారు. చలి తీవ్రత పెరిగిన దృష్ట్యా పట్టణంలో ఉన్న నాగవంశం కులస్థులలో అరవై ఏళ్ళు దాటిన వృద్ధులకు ఉపయుక్తంగా ఉంటుందని రగ్గులు పంపిణీ చేశామని, అలాగే స్పెషలిస్ట్ వైద్యులతో ప్రతి నెల ఒక మెడికల్ క్యాంప్ నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి సంఘం అండగా ఉంటామన్నారు. సంక్రాంతి పండుగ తర్వాత ఐ క్యాంప్ నిర్వహించి కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేయడమే కాకుండా అవరమైన వారికి క్యాటిరేక్ట్ ఆపరేషన్లు చేయించి కళ్ళద్దాలను అందిస్తామన్నారు. ఇటీవల నిర్వహించిన కార్తీక వన సమారదనలో ఇచ్చిన మాట ప్రకారం నాగ వంశీయులలో ఎవరైన మృతి చెందితే దహన సంస్కరణల బాధ్యతలను సంఘం తీసుకుంటుందని ఈ సందర్భంగా విక్రమ్ గుర్తుచేశారు. అదే విధంగా పెళ్లి కాని యువతీ యువకుల కోసం నాగవంశీయుల వివాహ పరిచయ వేదిక నిర్వహించే ఆలోచనలో ఉన్నామని, సభ్యులంతా చర్చించుకుని త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాగవంశం సంక్షేమ సంఘం ప్రతినిధులు కాళ్ళ గౌరీ శంకర్, అవనాపు విజయ్, అప్పారావు,రామసింగు సత్య ప్రసాద్ రావు, భానోజీరావు,కనకల కృష్ణ,పోలుబోతు మోహనరావు, రాయన నారాయణరావు, తలదా సత్యారావు, బుగత రోజా కుమార్,నామాల సర్వేశ్వరరావు, అవనాపు శ్రీను, బొడ్డు రమణ బాబు,బుగత జయరాం,అవనాపు జనార్ధనరావు,బోని శంకరరావు,మద్దిల ముత్యాలరావు,ముని లక్ష్మణ,బోని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిరాహార దీక్షలో అంగన్‌వాడీలు

విశాలాంధ్ర-జామి: తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న అంగన్‌వాడీల ఆందోళన సోమవారం నాటికి 14రోజులకు చేరింది. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన శిబిరంలో అంగన్‌వాడీలంతా నిరాహార దీక్ష చేసారు. తమకు ఎన్నికలముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. తమ డిమాండ్‌లపై స్పందించే వరకు సమ్మెను ఆపేది లేదన్నారు.

పార్టీ అభివృద్ధికి నావంతు కృషి చేస్తా

మండల వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు పిన్నింటి రవి

విశాలాంధ్ర-జామి: మండలంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి నావంతు శాయ శక్తులా కృషి చేస్తానని వైసీపీ మండల యువజన విభాగం అధ్యక్షునిగా నియమి తులైన కుమరాం సర్పంచ్ ప్రతినిధి పిన్నింటి రవికుమార్ అన్నారు. ఈమేరకు పార్టీ కేంద్ర కార్యాలయంనుంచి నియామక ఉత్తర్వులు అందుకున్న అనంతరం స్థానిక మండల పార్టీ అధ్యక్షుడు గొర్లెరవికుమార్, ఇతర పెద్దలు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలతో కలిసి గజపతి నగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్యను, ఎస్‌కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావును స్వయంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా వారంతా రవికుమార్‌కు పలు సూచనలు చేసారు. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ వైసీపీలో తనకు అత్యంత ప్రాదాన్యత ఇవ్వడమే కాకుండా తనను మండల యువజన విభాగం అధ్యక్షునిగా మరింత బాధ్యతలను అప్పగించారన్నారు. మండలంలో యువత వైసీపీకే తమ మద్దతు తెలిపేలా కృషి చేస్తానన్నారు.

విస్తృతమైన సేవా కార్యక్రమాలతోనే స్వచ్ఛంద సంస్థలకు గుర్తింపు

రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ రావూరి సుబ్బారావు (దత్త)

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: విస్తృతమైన సేవా కార్యక్రమాలతోనే స్వచ్ఛంద సంస్థలకు సమాజంలో తగిన గుర్తింపు లభిస్తుందని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ రావూరి సుబ్బారావు (దత్త) పేర్కొన్నారు. గవర్నర్ అధికారిక పర్యటనలో భాగంగా సోమవారం విజయనగరం విచ్చేసి పలు సేవా కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. పట్టణంలోని కంటోన్మెంట్ బాలాజీ మార్కెట్లో రోటరీ నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం, శిబిరంలో పాల్గొన్నారు. కోట జంక్షన్ వద్ద కూరగాయలు విక్రయించే ఆరుగురు వర్తకులకు గొడుగులను సమకూర్చారు. విజయనగరం రోటరీ క్లబ్ స్థాపించి 66 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గూడ్స్ షెడ్ వద్ద నిర్మించిన క్లాక్ టవర్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోటరీ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్లబ్ ద్వారా ఈ ఏడాది విజయనగరంలో వరుస సేవా కార్యక్రమాలను నిర్వహించామని తెలిపారు. ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు , 10వ తరగతి విద్యార్థులకు పరీక్షల మెటీరియల్ పంపిణీ, ప్రభుత్వ పాఠశాలల్లో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు , గ్రామాలలో రక్షిత నీటి పథకాల నిర్మాణం వంటి వివిధ కార్యక్రమాలను లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్వహించమన్నారు. సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ కృష్ణ శాంతి. క్లబ్బు కమ్యూనిటీ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ తిరుమల ప్రసాద్, కార్యదర్శి నీతూ విజ్వాని, బి. సూర్యలక్ష్మి , గవర్నర్ ఎలెక్ట్ డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, ప్రవీణ్ కుమార్ అంచాలయ, వినోద్, రాధికరాణి , సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

రెండు ఆటోలు ఢీ : ఇద్దరి పరిస్థితి విషమం



విశాలాంధ్ర-రేగిడి : విజయనగరం జిల్లా రేగిడి మండలం బూరాడ వద్ద రెండు ఆటోలు ఢీకొని పదిమందికి గాయాలు కాగా, అందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదంలో అంబాడ వెంకటాపురం, చాటయ్యవలస గ్రామాలకు చెందిన పలువురు గాయపడ్డారు. క్షత గాత్రులను 108లో రాజాం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కొరకు ఒకరిని విశాఖపట్నం తరలించారు. ఈ సంఘటనపై ఇంకా పూర్తి వివరాలు తెలియవలసి ఉంది.

నేటి నుండి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం..... అందరూ హాజరు కావాలి

ఎంపిడివో శశిబూషణరావు

విశాలాంధ్ర-వంగర : నేటి మంగళవారం నుండి జరగనున్న "ఆడుదాం" ఆంధ్రా కార్యక్రమం నకు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది విధిగా హాజరు కావాలని ఎంపిడివో హెచ్. శశిబూషణ రావు కోరారు.ఎవరు హజరు కాక పోయినా వారి పై చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అందరూ సచివాలయ సిబ్బంది ఉదయం 11 గంటల కు అన్ని సచివాలయాలు పరిధిలో ఉన్నటువంటి గౌండ్స్ వద్ద ఆడుదాం ఆంధ్రా ప్రారంభ కార్యక్రమం వద్దకు తప్పకుండా చేరుకోవాలని అదేశాలు జారీ చేశారు. ఇందులో ప్రజా ప్రతినిధులను, వాలంటీర్లును , గ్రామ ప్రజలను భాగస్వాములుగా చేయవలెనని సూచించారు. తదుపరి షెడ్యూల్ ప్రకారం అందరూ సచివాలయం సిబ్బంది వాలంటరీల సహకారం తో అన్ని ఆటలు నిర్వహించి వలసి ఉంటుందన్నారు. అతలంపోటీల స్కోర్ వివరాలును యాప్ లోనే నమోదు చేయాలని వివరించారు. సచివాలయ స్థాయిలో నిర్వహించే ఆటలను ఆడించే బాధ్యత సచివాలయ కమిటీదని వివరించారు. పోటీలకు ఆయా పరిదిలో కమిటీ ఉంటుందన్నారు.ఈ కమిటీలో పంచాయతీ కార్యదర్శి, విఆర్ఓ తో పాటు అందరూ సచివాలయ సిబ్బంది కూడా ఉంటారన్నారు. ఇవన్నియు జిల్లా కలెక్టర్ ఆదేశాలుగా ప్రకొన్నారు. క్రీడలు నిర్వహించే ఈ రెండు వారాలు పాటు సచివాలయ సిబ్బంది అందరూ తప్పకుండా హాజరై అందుబాటులో ఉండాలని అదేశాలు జారీ చేశారు.ఈ రెండు వారాలు ఎవరికి ఎటువంటి మినహాయింపులు కానీ సెలవులు మంజూరు చేయబడవని పేర్కొన్నారు.

ఆదమరిస్తే అంతే మరీ !

- అడివేరు చెరువు గట్టుపై తారు రోడ్డుకు పడిన గండి
- పట్టించుకోని సంబంధిత అధికారులు

విశాలాంధ్ర - వేపాడ : అక్కడ ఆదమరిస్తే అంతే మరీ. కాలి నడకన వచ్చినా బైక్ పై వచ్చినా అప్రమత్తంగా ఉండాలి. లేకుంటే ప్రాణాపాయం తప్పదు. ప్రమాదానికి లోనైతే ప్రాణమైనా పోవొచ్చు లేదా అంగవైకల్యానికైనా లోను కావొచ్చు. వివరాల్లోకి వెళ్తే మండలం లోని చామలాపల్లి పంచాయతీ శివారు వెంకయ్యపాలెం గిరిజన గ్రామానికి వెళ్ళే రహదారిలో గల అడివేరు చెరువు గట్టుపైన తారు రోడ్డుకు మధ్యలో పడిన గండి ప్రమాదకరంగా మారింది. గ్రామానికి వెళ్ళేటపుడు చెరువు గట్టు మీదకు వెళ్ళగానే పడిన గండి భయంకరంగా తయారయింది. పగటి పూట వెళ్లేవారికి గండి కనిపించే అవకాశం ఉంది. రాత్రి పూట మాత్రం ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం జరగక మానదు. కానీ అధికారులు గాని ప్రజా ప్రతినిధులు గాని పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ రోడ్డు టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి చొరవ తీసుకుని మంజూరు చేయడం జరిగింది. కానీ రోడ్డు నిర్మాణం సంబంధిత కాంట్రాక్టర్ నాణ్యతగా చేపట్టక పోవడంతో రోడ్డు శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు రోడ్డు మధ్యలో పెద్ద సైజులో గండి కూడా పడింది. ఇప్పటికైనా పాలకులు స్పందించి రోడ్డు పునర్నిర్మాణం చేపట్టి రోడ్డుకు పడిన గండిని పూడ్చాలని వెంకయ్యపాలెం గ్రామస్తులు కోరుతున్నారు.

గజపతినగరంలో అంగన్వాడీలు నిరాహార దీక్ష

విశాలాంధ్ర - గజపతినగరం : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గజపతి నగరంలోని జాతీయ రహదారి ప్రక్కన అంగన్వాడీలు నిరాహార దీక్షలు చేపట్టారు సోమవారం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు వి లక్ష్మి పార్టీ కండువాలు వేసి దీక్ష ప్రారంభించారు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి క్రిస్టమస్ పండగ అక్కడ చేసుకుంటూ రాష్ట్రంలో ఉన్న అంగన్వాడీలు రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు పండగ పూట మమ్మల్ని నా కుటుంబాన్ని రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎం సుభాషిని రాములమ్మ జ్యోతి సన్యాసమ్మ సౌజన్య పద్మ మరియు ఆర్టీసీ యూనియన్ నాయకులు చంద్రయ్య మద్దతు పలికారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి శ్రీదేవి టీచర్‌కి ఘన సన్మానం

- కవిసమ్మేళనంలో చూపిన ప్రతిభకు పట్టం - ప్రశంసల జల్లు కురిపించిన వాగ్దేవి కళాపీఠం

విశాలాంధ్ర - వేపాడ : ఒక పక్క ఉపాధ్యాయ వృత్తిలో రాణిస్తూ మరోపక్క గాన కవికోకిలగా పేరు ప్రఖ్యాతలు పొందిన శ్రీదేవి టీచర్ విజయవాడలో మరోసారి ఘన సన్మానం అందుకున్నారు. వాగ్దేవి కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు గానుగుల యుగంధరాచార్యులు ధనుర్మాసాన్ని పురస్కరించు కొని ఏర్పాటు చేసిన కవి సమ్మేళనంలో విష్ణుమూర్తి అవతారాల్లో ఒకటైన శ్రీరాముని గూర్చిన పద్యాలు రాసి గానం చేసినందుకు సభికులు మంత్ర ముగ్ధులయ్యారు. ఈ సందర్భంగా కవి సమ్మేళనంలో పాల్గొన్న ఆంధ్రా, తెలంగాణా, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుండి తరలి వచ్చిన మహా కవులు, బ్రహ్మశ్రీ డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, తెలుగు పండితులు పరాశరం వెంకట రమణాచార్యులు, కళారత్న డాక్టర్ జీవి పూర్ణ చంద్, డాక్టర్ కేఆర్జీ శేషకుమార్, కవికోకిల డాక్టర్ జిల్లేపల్లి వేంకట చలపతి రావు తదితరుల సమక్షంలో సన్మాన సత్కారాలు చేశారు. ఈ సందర్భంగా మండలంలోని బానాది గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయరాలిగా పని చేస్తున్న శ్రీదేవి మాట్లాడుతూ ఎందరో ప్రతిభా వంతులైన గురువుల చేతుల మీదుగా సన్మానం అందుకోవడమే కాకుండా వారి ప్రసంగాలు మార్గదర్శ కాలుగా నిలిచి మనసును హత్తుకున్నాయని వెల్లడించారు.

ఇందిరా కాలనీలో ఘనంగా జరిగిన క్రిస్టమస్ వేడుకలు

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : పట్టణంలోని ఇందిరాకాలనీ కొత్త వీదిలో క్రిస్టమస్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. వీదిలో యువతీ యువకులు ఏర్పాటు చేసిన కార్య క్రమంలో ముఖ్య అతిథిగా ప్రభుత్వ ఎస్వీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల చలపతిరావు పాల్గొని క్రిస్టమస్ కేకునికోసి అందరికీ తినిపించి శుభాకాంక్షలు తెలిపాటు. క్రైస్తవ సోదరులు కలిసి మెలిసి ఉండాలని, జీసస్ క్రీస్తు బోధనలు వినిపించారు. ఈ కార్యక్రమంలో సిరిపురపు సుమన్,పాలకొండ ప్రవీణ్, పెద్ద పొలు, దుర్గా ప్రసాద్,కార్తీక్, వంశీ, రాజేష్, రోహిత్, వెంకటేష్, సాయి, చందు,రమేష్, అచ్యుత రావు, దీప, లక్ష్మి, సుమ, సుశీల తదితరులు పాల్గొన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల చలపతిరావును వారు దుస్సాలువా కప్పి సత్కరించారు. వీదిలో యువతీ యువకులు క్రిస్టమస్ పండుగ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.

వైసీపీ గెలుపే ధ్యేయంగా పనిచేస్తా

మండల యువజన విభాగం అధ్యక్షుడు ఉగ్గిన

విశాలాంధ్ర - వేపాడ : వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపే ధ్యేయంగా పనిచేస్తానని మండల యువజన విభాగం అధ్యక్షుడు ఉగ్గిన శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పార్టీ నాపై ఎంతో నమ్మక ముంచి మండల యువజన విభాగం అధ్యక్షుడుగా నియమించడం హర్షణీయమన్నారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను తూ చ తప్పకుండా పాటిస్తూ మండలంలో పార్టీ బలో పేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. స్థానికంగా వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపిస్తూ రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ని మరలా సీఎంను చేసేందుకు అవసరమైన శక్తిని యుక్తిని కూడగడతామన్నారు. అలాగే మండల స్థాయిలో యువశక్తిని కూడగట్టి సీఎం జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెల్లేందుకు అహర్నిశలు శ్రమిస్తామని మండల యువజన విభాగం అధ్యక్షుడుఉగ్గిన శ్రీనివాసరావు అన్నారు.

మంత్రి బొత్స సత్యనారాయణను కలిసిన ఎమ్మెల్సీ రఘురాజు దంపతులు

విశాలాంధ్ర - శృంగవరపుకోట : విశాఖపట్టణంలో రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణని మర్యాద పూర్వకంగా ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, సుధారాజు దంపతులు కుటుంబ సమేతంగా సోమవారం సాయంత్రం కలిశారు. ఈ సందర్భంగా మళ్లీ రెండోసారి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలనే దృఢ సంకల్పంతో ఎస్.కోట మండలం, బొడ్డవర నుండి తిరుమలలోని శ్రీవారి ఆలయం వరకు 820కిలోమీటర్ల పాదయాత్రను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఎమ్మెల్సీ రఘురాజుని మంత్రి బొత్స అభినందించారు. అనంతరం మంత్రి బొత్స సత్యనారాయణ యోగక్షేమాలను ఎమ్మెల్సీ అడిగి తెలుసుకున్నారు.

జిన్నాంలో మహిళలకు చీరలు పంపిణీ

విశాలాంధ్ర - గజపతినగరం : మండలంలోని జిన్నాం గ్రామంలో సోమవారం క్రిస్మస్ పురస్కరించుకొని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు దేవర ఈశ్వర రావు క్రిస్టియన్స్ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి క్రిస్టియన్ మహిళలు వితంతు వులకు చీరల పంపిణీ చేశారు పవిత్రమైన క్రిస్టమస్ పండగ అందరికీ ఆనందాన్ని ఇచ్చే పండగ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు పొగిరి గౌరీ పాల్గొన్నారు.

జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా బుజ్జి

విశాలాంధ్ర - వేపాడ : వేపాడ మండల జనసేన పార్టీ మండల ప్రధాన కార్య దర్శిగా వావిలపాడు గ్రామానికి చెందిన పేంటపల్లి బుజ్జి నియామక మయ్యారు. ఈ మేరకు రాష్ట్ర పార్టీ కార్యా లయం నుండి ఆదేశాలు వచ్చినట్లు తెలిపారు. అలాగే పెంటపల్లి బుజ్జి 2019 నుండి జనసేన పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారని, ఈయన సేవలకు గుర్తింపుగా మండల ప్రధాన కార్యదర్శిగా నియమితులవడంతో మండల జనసైనికులు అభిమానులు పలువురు అభినందనలు తెలియజేశారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ఒకటి డివిజ న్‌లో గల చర్చి నందు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు కార్య క్రమానికి వైఎస్ఆర్సిపి విజయ నగరం పార్లమెంటరీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముద్దాడ మధు హాజరవడం జరిగింది ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ క్రైస్తవ సోదరులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తూ క్రీస్తు బోధనల ద్వారా పేదవారికి సహాయం చేస్తూ ప్రపంచశాంతికి ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని తెలియజేశారు.

క్రీస్తు బోధనలతో సమాజంలో శాంతి

ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్

విశాలాంధ్ర - చీపురుపల్లి : ఎచ్చెర్ల నియోజక వర్గం రణస్థలం మండలం పైడి భీమవరం గ్రామంలో చర్చ్‌లో క్రిస్మస్ పర్వదిన వేడుకలను పురస్క రించు కొని కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియ జేసిన ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ఈ సందర్భంగా ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ మాట్లాడుతూ లోక రక్షకుడైన ఏసుక్రీస్తు జన్మదిన పురస్కరించుకొని క్రైస్తవ సోదర సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. సమస్త మానవాళి ప్రేమా కరుణ దయా శాంతి మార్గం చూపిన ఏసుక్రీస్తు జన్మదిన క్రైస్తవ సోదరులకు గొప్ప పర్వదినము అని తెలిపారు. క్రీస్తు సందేశం అందరూ ఆచరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి లంకలపల్లి ప్రసాద్, వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, దైవ సేవకులు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆడుదాం ఆంధ్ర ప్రారంభం

విశాలాంధ్ర - పార్వతీపురం : జిల్లాలో మంగళ వారం నుండి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలియ జేశారు. ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా ప్రారం భించిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంకు జిల్లాలో 79,800 ఆటగాళ్ల రిజిస్ట్రేషన్ లక్ష్యం కాగా 82.59 శాతంతో 65, 905 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అన్ని గ్రామ/వార్డు సచివాలయంలలో నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు ప్రకటనలో తెలిపారు.

బీజేపీ జెండా ఆవిష్కరణ

విశాలాంధ్ర - చీపురుపల్లి : భారతీయ జనతా పార్టీ విజయ నగరం జిల్లా, చీపురుపల్లి నియోజ వర్గం, ఈరోజు భారతరత్న అటల్ బీహార్ వాజ్‌పేయి 99వ జన్మదిన శుభ సందర్భంగా చీపురు పల్లి ఇన్చార్జ్ ఎస్వీఎం రాజు గారి ఆధ్వర్యంలో చీపురుపల్లి మండలం దేవరపొదిలం గ్రామంలో జండా ఆవిష్కరణ జరిగింది. అక్కడున్న చిన్నపిల్లలకు స్వీట్లు కూడా అందజేయడం జరిగింది అదే విధంగా గరివిడి మండలం శ్రీరామ్ నగర్ అందులకు స్కూల్లో అన్నదాన కార్యక్రమం జరిగింది, ఈ కార్యక్రమానికి డి.శంకర్ ఆల్ శర్మ అల్లూరి రామకృష్ణ రాజు గారు, ఇప్పిరి నీలకంతం, త్రినాధ్ రాము, వెంకట్రావు వెంకట్రావు, కొండపల్లి శ్రీనివాసరావు గారు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

అంగన్వాడీలకు అదనంగా వెయ్యి రూపాయల వేతనం పెంచాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ

విశాలాంధ్ర - శృంగవరపుకోట : ప్రజా సంకల్ప యాత్ర సమయంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణ రాష్ట్రంలోని అంగన్వాడీల జీతం కన్నా అదనంగా వెయ్యి రూపాయలు మన అంగన్వాడీలకు ఇచ్చి హామీని వెంటనే నిలబెట్టుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ కోరారు. 14వ రోజు సమ్మెలో భాగంగా ఐసీడీఎస్ కార్యాలయం ఎదురుగా అంగన్వాడీలు సోమవారం చేపట్టిన రిలే దీక్షలకు సీఐటీయూ నాయకులు మద్దతు ప్రక టించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు గ్రాట్యుటీ అమలు చేయాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలి, చివరి వేతనంలో సగం పెన్షన్ గా ఇవ్వాలి, ఐసిడిఎస్ కి బడ్జెట్ ఎక్కువ కేటాయించి అభివృద్ధి చేయాలన్నారు. శిశు సంక్షేమ శాఖకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న నాణ్యమైన సరుకులు అందించాలని డిమాండ్ చేశారు. మినీ వర్కర్స్ ను మెయిన్ వర్కర్లుగా మార్చాలి. వర్కర్లు, హెల్పర్లకు వయోపరిమితి పెంచాలి. విధి నిర్వహణలో చనిపోయిన అంగన్వాడీ వర్కర్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. 2017నుంచి ఉన్న బకాయి డీఏలు విడుదల చేయాలని సూచించారు. అంగన్వాడి సెంటర్లకు వంటగ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, అంగన్వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలి. ప్రభుత్వ ఉద్యో గులుగా గుర్తించాలని, అంగన్వాడీలు అడుగుతున్న న్యాయ మైన సమస్యలుపరిష్కరించడం మానేసి సమస్యను జటిలం చేయడం ప్రభుత్వానికి తగదు. కేంద్రంలో మోడీ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి అంగన్వాడీల పట్ల నిర్లక్ష్యం విడ నాడి వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. శిశు సంక్షేమ శాఖకు బడ్జెట్ ఎక్కువ కేటాయించి నాణ్యమైన సరుకులు అందించి పైతెలిపిన న్యాయమైన సమస్యలు పరిష్కరించనీ ఎడల పెద్దఎత్తున పోరాటాలు చేపడుతామని హెచ్చరించారు. తర్వాత జరిగే పరిణామాలకు పాలక ప్రభుత్వాలు బాధ్యతవహించాల్సి వస్తుందన్నారు. ఈ కార్య క్రమంలో సిఐటియు జిల్లా కమిటీ మెంబర్ చెలికాని ముత్యాలు, సిఐటియు అనుబంధం అంగన్వాడి ప్రాజెక్టు లీడర్ డి.శ్యామల, డి.జయలక్ష్మి, ఏఐటీయూసీ అనుబంధ సంఘ ప్రాజెక్టు లీడర్స్ వాడపల్లి మాణిక్యం, కే.సుశీల పాల్గొన్నారు.

అటల్ బిహారీ వాజపేయి కలలు కన్న భారతదేశాన్ని నిర్మిద్దాం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : భారతరత్న మాజీ భారత ప్రధానమంత్రి దివంగత అటల్ బిహారీ వాజ్ పేయి జయంతి సందర్భంగా సోమవారం పట్టణంలో ఉన్నకేఎల్ పురం యాతపేట కోలనీ జంక్షన్ భారతీయ జనతా పార్టీ జెండా ఆవిష్కరణకార్యక్రమం చేయడం జరిగింది.ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమంచి సుబ్బారావు మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం అటల్ బిహారీ వాజ్ పేయి జయంతి రోజును అనగా సుపరిపాలన దినోత్సవం గా ప్రకటించిందన్నారు వాజ్పేయి వారి పరిపాలనలో మన భారత దేశం వివిధ రంగాలలో అభివృద్ధి సాధించి ఒక గొప్ప పరిపాలన అందించిన నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సుపరిపాలన దినోత్సవంగా ప్రకటించారు అన్నారు. అనేకమంది పేద కుటుంబాలకు నూతన వస్త్రాలతో ఆహార పదార్థాలు పంపిణీ చేయడం జరిగింద ని విజయనగరం అసెంబ్లీ కన్వీనర్ ఇమంది సుధీర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అష్టలక్ష్మి ఆలయం ఫౌండర్ దుర్గా బాలాజీ, ప్రముఖ అడ్వకేట్ . ఎస్ ఎస్ ఎస్ ఎస్ రాజు, కంది రాంబాబు, ఎం.బి. అప్పారావు దొర, వెస్ట్ జోన్ మండల అధ్యక్షులు పసుపునాటి గిరిబాబు,సరస్వతుల నాగమణి, యువమోర్చా అధ్యక్షులు పిల్ల నవీన్, జిల్లా కార్యదర్శి మజ్జి రమేష్, కంది సీతారాం, కూర్మా రావు, పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో సోమవారం సుపరిపాలన దివాస్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బిలి శ్రీను ఆధ్వర్యంలో భారతదేశ మాజీ ప్రధాన మంత్రి,భారతమాత

ముద్దుబిడ్డ, భారతరత్న అటల్ బిహారి వాజ్ పేయిజయంతి వేడుకలను బిజెపి జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా బొబ్బిలి శ్రీను భారతీయ జెండా పార్టీ జెండా ఆవిష్కరించారు అనంతరం వాజ్ పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత వాజ్ పేయి ప్రధానిగా ఉన్నప్పుడు భారతదేశం వివిధ రంగాల్లో అభివృద్ధి సాధించిందని గొప్ప పరిపాలన అందించిన నేపథ్యంలో నరేంద్ర మోడీ ఆయన జయంతి రోజున సుపరిపాలన దినోత్సవం గా ప్రకటించారన్నారు. వాజ్ పేయి కలలను ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వాటిని సాకారం చేసే దిశగా అడుగులు వేస్తున్నారన్నారు.ఆయన తన జన్మను, దేహాన్ని, పదవిని దేశానికి అంకితం ఇచ్చారన్నారు .ఈ కార్యక్రమంలో మజ్జి రమేష్, జీకే యాదవ్ తదితర పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర - కురుపాం : క్రిస్మస్ వేడుకలు ను మండలం లోని అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వ హించారు. ముందు రోజు నుంచి చర్చి లలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక గుడ్ సమరిటన్ చర్చిలో యువకులు దైవసంబంధ సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.అందరూ ఆయురారోగ్యాలతో హాయిగా ఉండాలని ,రైతులు అధిక దిగుబడి లు సాధించేందుకు సహాయం చేయాలని ఏసుక్రీస్తు ను ప్రార్థించారు. కురుపాం రావాడ రోడ్ జంక్షన్ సమీపంలో ఉన్న గుడ్ సమారిటన్ లూథరన్ చర్చి లో పాస్టర్ రెవరెండ్. పి.జీవన్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగిన క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కారించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేసిన క్రైస్తవ సహోదరి, సహోదరులు కార్యక్రమంలో సంఘపెద్దలు దోనక జాన్, దొనక రాజా రత్నం, కోట సుందర సుదర్శన్, దొనక ప్రదీప్, దోనక జయ కుమార్, కోట ఈశ్వర రావు, దొనక మజ్జి బాబు, రత్నమ్మ, సుకన్య, సుధా, పాల్గొన్నార.

క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న పరీక్షిత్ రాజు

చినమేరంగి రెల్లి వీధిలో చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలు లో పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సంద ర్భంగా పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించీ ఆశీర్వదించారు.

నిబంధలకు విరుద్ధంగా చెఱకు ట్రాక్టర్లు తరలింపు

విశాలాంధ్ర - వంగర : సోమవారం నాడు మధ్యాహ్నం 12.30గంటలు సమయంలో అతి బరువుతో చెఱకు ట్రాక్టర్ మండల కేంద్రం వంగర గ్రామం బస్ స్టాండు వద్ద ను కొద్ది పాటి ఎక్కుడును ఎక్కలేక పోవటంతో గంట అనంతరం మరో ఖాళీ ట్రాక్టర్ వచ్చి,రెండు ట్రాక్టర్లు కలిసి లాగితే తప్ప ఆ చెఱకు ట్రాక్టర్ చిన్నపాటి ఎక్కుడు వద్ద లాగలేకుండా ఉందంటే, మరి ఎంత బరువులతో చెఱకు ట్రాక్టర్లు మళ్లిస్తున్నారో నన్నది ప్రత్యేకంగా చెప్ప నక్కర్లేదు. సంకిలి షుగర్ ఫ్యాక్టరీ వారు నిబంధనలకు పాతర వేస్తూ డబుల్ లోడ్లుతో చెఱకును ఇష్టానుసారంగా తరలిస్తున్న ప్పటకీ సంభందిత అధికారులు కానీ, ఏ ఒక్క అధికారులు పట్టించుకోవటం లేదన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.ఇరుకైన రోడ్లు మీదుగా మండలకేంద్రం బస్ స్టాండ్ వద్ద నుగల షాపులు కు అనించి డబుల్ లోడ్లు వేసుకొని తిరుగు తుండటంతో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ షాపు మీదును ఈ చెఱకు ట్రాక్టర్లు పడిపోయి ఏం ప్రమాదం సంభవిస్తుం దొ తెలియని పరిస్థితు వల్ల నిత్యం ప్రజలు తో ఉన్నటువంటి ప్రదేశంలో షాపు యజమానులు,ప్రజలు బారీ బరువులతో తిరుగు తున్నచెఱకు ట్రాక్టర్లు వల్ల ఆందోళన మద్య కొట్టు మిట్టాడుతున్నారు. అంతేకాకుండా పూర్తిగా పాడై గొతులతో ఉన్న రోడ్లు బరువైన చెఱకు ట్రాక్టర్లు వల్ల పూర్తిగా రోడ్లు పాడైనప్పటికీ బారీ లోడ్లుతో చెఱకు ట్రాక్టర్ లు మండలంలో గల అనేక గ్రామాల నుండి వెల్తున్నసమయంలో ప్రజలు ఇబ్బందులు నె దుర్ కొంటున్నారు.ఈ బరువైన చెఱకు లోడ్లు తో నడుస్తున్న ప్పుడు ప్రజలు ఇరుకు రోడ్లు మీదగా వెళ్ళటం వల్లనే కాకుండా, పల్లె గ్రామాల్లో వెళ్తున్న సమయంలో ఇరుకైన రోడ్లు,వీదుల్లో నుండి అధిక బరుతో ప్రమాద బరితంగా వెళ్తుండటం తో తీవ్ర ఆందోళన చెందుతన్నారు.పూర్తిగా ప?సమయంలో ఇరుకైన రోడ్లు,వీదుల్లో నుండి అధిక బరుతో ప్రమాద బరితంగా వెళ్తుండటం తో తీవ్రఆందోళన చెందుతున్నారు. పూర్తిగా పాడైన ఇరుకు రోడ్లు మీదుగా బారీ లోడ్లు తో వెళ్తున్న చెఱకు లోడ్లుతో ట్రాక్టర్ లు గోతులరోడ్లు,విద్యుత్ వైర్లుఆ బారీ చెఱకు లోడ్లుతోవెళు ్తన్నప్పుడు తగిలి ప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉంటుందని పలు గ్రామాల ప్రజలు తీవ్రఆందోళన వ్యక్తం చేస్తున్నారు.నిబంధనలకు విరుద్ధంగా అతి బరువైన చెఱకు ట్రాక్టర్ లోడ్లు గ్రామాల్లో నుండి,రోడ్లు మీదుగా ప్రమాద స్థాయిలో వెళ్తున్నప్పటకీ సంబంధిత అధికారు లు పట్టించుకోవటం లేదన్న ఆరోపణలున్నాయి. వంగర మండలంలో గల వీవీ అర్ పేట, జకే గుమ్మడ, రాజుల గుమ్మడ, చినరాజుల గుమ్మడ, ఋషింగి తలగాం,శివ్వాం, వంగర, ఎం.శీతారాంపురం,కొత్తవలస, కొప్పరవల స,నీలయ్యవలస, భగింపేట, కింజంగి, ఇరువాడ, శీతాదే విపురం, చంద్రంపేట, చౌదరి వలస తదితర గ్రామాల్లో చెఱకు పంట ను రేగిడి మండలం సంకిలి సుగర్ ఫ్యాక్టరీ కి ఇక్కడ నుండి చెఱకు ను తరలింపు మొదలు పెట్టారు. అత్యధిక బరువుతో వెళ్తున్న చెఱకు ట్రాక్టర్ లు వల్ల ఇటు రోడ్లు, అటు గ్రామాల్లోప్రజలు, ట్రాక్టర్ లు వల్ల ఇటు రోడ్లు, అటు గ్రామాల్లోప్రజలు,ప్రయాణీకులు అందరూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ప్రజలురోడ్లుపూర్తిగాడైననూ,అతి బరువైన చెఱకు లోడ్లు తరలిస్తుండటం వల్ల ఇన్ని ప్రమాద పరిస్థితులు న్నప్పటకిమ అధికారు లెవ్వరూ పట్టించుకోవటం లేదని ప్రజలు మండి పడుతున్నారు. సంభందిత అధికారులు కల్పించుకొని నిబంధనలకు అనుగుణంగా నిబంధనల మేరకు బరువులతో చెఱకు ట్రాక్టర్లను ఫ్యాక్టరీ కి తరలేటట్లు చూసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, గోతులతో ఉన్నటువంటి రోడ్లు పూర్తిగాపాడవ్వకుండా చూడాలని సర్వత్రా కోరు చున్నారు.